క్లుప్తంగా

డీకేడబ్ల్యూసీ విద్యార్థినుల సత్తా


ఆయేషా


శ్రీజ


విజయలక్ష్మి


సంగీత

నెల్లూరు(అర్బన్): ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. సీనియర్ కంప్యూటర్ సైన్సు కోర్సులో ఎస్కే ఆయేషా (964), జూనియర్ కంప్యూటర్ సైన్స్ కోర్సులో శ్రీజ (480), సీనియర్ బైపీసీలో విజయలక్ష్మి (949), జూనియర్ ఎంపీసీలో సంగీత (440) మార్కులు సాధించి కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారని వివరించారు.

ఆదిత్య విద్యార్థుల విజయభేరి



నెల్లూరు(అర్బన్): ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు విజయభేరి మోగించారని ఆదిత్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఎంపీసీలో పావని (987), సాయివైష్ణవి (985), వాణి (979), సీనియర్ బైపీసీలో కిరణ్‌చాంద్ (942), ఆసిఫా (934) మార్కులను సాధించారని తెలిపారు. జూనియర్ ఎంపీసీలో మాధవరెడ్డి (461), గౌతంరెడ్డి (459), యశస్విని (457) మార్కులను సాధించారని వివరించారు.

వర్ధన్‌రెడ్డి కళాశాల విద్యార్థుల హవా



నెల్లూరు(అర్బన్): ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు హవాను కొనసాగించారని వర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. సీనియర్ ఇంటర్‌లో సీహెచ్ హంసిని 988, జ్యోష్నప్రియ 984, మహీధర్‌రెడ్డి 984, కుసుమప్రియ 981, తీక్షణ 980 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో సుకృత 464, లావణ్య 461, అశ్విని 458, కౌశిక్ 458, శ్రీహర్ష 457 మార్కులు సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ కళాశాల విద్యార్థుల విజయకేతనం



నెల్లూరు(అర్బన్): ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఎస్సార్ జూనియర్ కళాశాల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ మధుకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఎస్సార్ కళాశాలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు హరి 465, లక్ష్మీశివాని 464, చరణ్ 464, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు మానస 989, హన్సిత 986, రమ్యశ్రీ 986 మార్కులు సాధించారని వివరించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థులు భార్గవి 984, నిత్య 983 మార్కులు సాధించారని తెలిపారు.

రేపు అయ్యప్పస్వామి విషుక్కణి దర్శనం



నెల్లూరు(బృందావనం): కేరళ సంవత్సరాది విషు పర్వదినం సందర్భంగా వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం విషుక్కణి దర్శనం కల్పించనున్నట్లు శ్రీస్వామి అయ్యప్పసేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం దేవస్థానంలో ఆవిష్కరించారు. అయ్యస్వామి సన్నిధిని ఫలకూరగాయలు, ధాన్యాలతో అలంకరించనున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వామి సర్వాలంకార శోభితంగా భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. అయ్యప్పస్వామి తరుపున మేల్‌శాంతి భక్తులకు నాణేలను కానుకగా అందజేస్తారని తెలిపారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సేవా సమాజం సభ్యులు బీ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదాలతోనే మా పయనం


పార్టీలో చేరిన 20వ డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పలువురు మద్దతు ప్రకటించారు. నెల్లూరు రూరల్ అభివృద్ధి ప్రదాత ఆదాల వెంటే తమ పయనమంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు.

• 29వ డివిజన్‌కు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. 29వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ షేక్ సత్తార్, జేసీఎస్ కన్వీనర్ కొండా సాయిరెడ్డి, దర్గా కమిటీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, తదితరుల ఆధ్వర్యంలో గౌస్, మైనుద్దీన్ వారి మిత్రబృందం సుమారు 20 మందికిపైగా మినీబైపాస్‌లోని కార్యాలయంలో ఆదాల సమక్షంలో పార్టీలో చేరారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, 29వ డివిజన్ ముఖ్యనాయకులు సీహెచ్ సూరిబాబు, షేక్ జాకీర్, నవీద్, జుబేర్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

30 చేనేత కుటుంబాల చేరిక

రూరల్ నియోజకవర్గంలోని 28, 30, 31, 32 డివిజన్లకు చెందిన 30 చేనేత కుటుంబాలు జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, నాగేశ్వరరావు, తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన చేనేత కార్మికుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మంగలపూడి శ్రీకాంత్‌రెడ్డి, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డౌనీహాల్ చైర్మన్ మద్దతు

వీఆర్సీ సెంటర్‌లోని డౌనీహాల్ చైర్మన్ డీ సురేంద్రబాబు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మినీబైపాస్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి ఆదాల గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు వేలూరు శివసునీల్‌రెడ్డి, సీహెచ్ సూరిబాబు, ముడియాల రామిరెడ్డి, కొండేటి శివారెడ్డి, దారా వంశీ, తదితరులు పాల్గొన్నారు.

• ప్రముఖ విద్యావేత్త, పారుల్ వర్సిటీకి చెందిన వీ నిఖితశ్రీ వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మినీబైపాస్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తన మద్దతు తెలిపారు. ఆదాల విజయానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

• 21వ డివిజన్‌కు చెందిన 25 కుటుంబాల టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మల్లు సుధాకర్‌రెడ్డి, వైవీరెడ్డి, మాజీ కార్పొరేటర్ వేల్పుల రజిని, ఏపీఆర్ ఆర్మీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• 31వ డివిజన్‌కు చెందిన 30 కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి, నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, చంద్ర, శీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.


చేనేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల


ఆదాలను కలిసిన సురేంద్రబాబు

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియ


సమావేశానికి హాజరైన ఎన్నికల సిబ్బంది


మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

• నెల్లూరు సిటీ ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రక్రియను అన్ని విభాగాల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 124 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఒకే చోట ఉన్న 33 ప్రాంతాల్లో ఓటరు అసిస్టెంట్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఓటర్లకు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎన్నికలను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు అందుకున్న ఫారం–6 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పైస్థాయి అధికారుల ఆమోదం కోసం పంపాలని బీఎల్వోలకు సూచించారు. హోమ్ ఓటింగ్ నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని సూచించారు. 18 నుంచి 20వ తేదీ వరకు ఫారం–12డీ ద్వారా 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే పోలింగ్ సిబ్బంది వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఏఆర్వో పీ దేవీకుమారి, ఏఈఆర్వో వెంకటేశ్వరరావు, టీపీఆర్వో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ అభివృద్ధికి ఆదాలను దీవించండి


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే ప్రతిఒక్కరూ తన తండ్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని దీవించాలని ఆదాల హిమబిందు కోరారు. 20వ డివిజన్, నక్కలగుంటలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాసేవ కోసమే తన తండ్రి రాజకీయాల్లోకి వచ్చారని స్పష్టం చేశారు. ఆయన ఆశయాలకు నెల్లూరు రూరల్ ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలిపి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరు సురేష్‌బాబు, రావు శ్రీనివాస్‌రావు, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, దువ్వూరు నగేష్‌రెడ్డి, వాకాటి వెంకటరమణారెడ్డి, ఆరుగుంట రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, షేక్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుపై మా తండ్రికి అపార ప్రేమ


ఎన్నికల ప్రచారం చేస్తున్న నేహారెడ్డి, సునంద

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులో పుట్టి పెరిగిన తన తండ్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి ఈ ప్రాంతంపై అపారమైన ప్రేమ ఉందని ఆయన కుమార్తె నేహారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 47వ డివిజన్‌లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తల్లి సునందరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తన తండ్రి వృత్తి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసినా నెల్లూరు బిడ్డగా ఆయనకు ఈ ప్రాంతంపై ప్రత్యేకమైన ప్రేమ, అభిమానం ఉన్నాయన్నారు. నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. తన తండ్రి మాట ఇస్తే నెరవేర్చే వరకు నిద్రపోరన్నారు. తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఎప్పుడైనా తమ ఇంటి తలుపు తట్టి సమస్యలను నేరుగా తమతో చెప్పుకోవచ్చన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెల్లూరును తన తండ్రి అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్పొరేటల్ పొట్లూరి రామకృష్ణ మాట్లాడుతూ 47వ డివిజన్‌లో రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.40 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నేతలు ఖజానా శేషు, దండపాణి సురేష్, సీహెచ్ రామకృష్ణ, పుట్టా లక్ష్మి, శివకామి, కర్తం జ్యోతి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, మహిళా నేతలు హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయండి


అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరురూరల్ పరిధిలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ, నెల్లూరురూరల్ నియోజకవర్గాల ఆర్వోలు వికాస్, మలోల, తదితరులు ఉన్నారు.

సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించాలి


బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): సమాజానికి అవసరమైన రచనలు, కథలు, సాహిత్యంపై యువతలో ఆసక్తిని పెంపొందించాలని ప్రభుత్వ విశ్రాంత అధ్యాపకురాలు భారతీదేవి అన్నారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉగాది సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిడుగు రామమూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, తదితర కవులు సమాజంలోని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజలను చైతన్యం చేశారన్నారు. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేశారన్నారు. నేటి విద్యార్థులు సైతం సమాజ ఉన్నతి కోసం తమ రచనలు కొనసాగించాలన్నారు. నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు శేషయ్య, మోహన్‌రాజు, దేవరకొండ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోండి


చిన్నబజార్ స్టేషన్ పరిధిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని వీఆర్సీ సెంటర్, డైకస్‌రోడ్డు, చేపలమార్కెట్, కోటమిట్ట, మెక్లిన్స్‌రోడ్డు, వాకర్స్‌రోడ్డు, గేటు సెంటర్, ఇరగాళమ్మ సెంటర్‌లో కేంద్ర బలగాలతో కలిసి ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ శుక్రవారం కవాతు నిర్వహించారు. అలాగే టీపీగూడూరు, కొండాపురం, ఆత్మకూరు, కందుకూరు పోలీసుస్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

ఓటమి భయంతోనే కోటంరెడ్డి విమర్శలు


మాట్లాడుతున్న జీవీ ప్రసాద్

నెల్లూరు(దర్గామిట్ట) : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించిన నాటి నుంచి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, దాంతోనే విమర్శలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో రూరల్‌లో ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన కోటంరెడ్డి వెన్నుపోటు పొడిచారన్నారు. రూరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఆదాల ఓట్లు అభ్యర్థిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కోటంరెడ్డి డ్రామాలు, మాయ మాటలు, విష సంస్కృతికి ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. తమ నాయకుడు ఆదాల వివాదాలు,కక్షలు, కార్పణ్యాలకు దూరంగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వ్యక్తి అనే విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆదాల దాదాపు రూ.950 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఇకనైనా ఆదాలపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితువు పలికారు. .కోటంరెడ్డి తన తమ్ముడు గిరిధర్‌రెడ్డిని షాడో ఎమ్మెల్యేగా తీసుకొచ్చి సాగించిన అరాచకాలను ప్రజలు గుర్తుపెట్టుకుని ఉన్నారని, రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతారన్నారు. కోటంరెడ్డిపై గతంలో టీడీపీ నాయకులు చేసిన విమర్శపై నేడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ఆదాలతోనే సాధ్యమని ప్రజలు గమనించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇరుగాళమ్మ, రాజేంద్రనగర్, కోటమిట్ట, ఏకేనగర్, కిసాన్‌నగర్, నవాబుపేట మార్కెట్ యార్డు, జగదీష్ నగర్, వెంకటేశ్వరపురం, హరనాథపురం, గోమతినగర్, బీవీనగర్, వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బీర్ బాటిల్‌తో దాడి

నెల్లూరు(క్రైమ్): తనను పనిలో నుంచి తీసేశాడన్న అక్కసుతో యజమానిపై కారు డ్రైవర్ బీర్ బాటిల్‌తో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..జెడ్పీ కాలనీకి చెందిన భరత్ చంద్ర ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. అతని వద్ద వెంగళరావునగర్‌కు చెందిన అనిల్‌రాజ్ కారు డ్రైవర్‌గా ఏడాదిగా పనిచేస్తున్నారు. ఇటీవల కారు డ్రైవర్ కస్టమర్ల నుంచి అధికంగా నగదు, పెట్రోల్ బిల్లులో కమిషన్ తీసుకోవడం, మద్యం సేవించి వాహనం నడపడం చేయసాగాడు. ఈ విషయం యజమానికి తెలియడంతో కారు డ్రైవర్‌ను పని నుంచి తొలగించాడు. దీంతో యజమానిపై అనిల్‌రాజ్ కక్ష పెంచుకున్నాడు. శుక్రవారం యజమాని ఇంటి వద్దకు వచ్చి అర్జెంట్‌గా మీతో మాట్లాడాలని వాటర్‌ట్యాంకు డౌన్‌లోని అమీర్ అంగడి సెంటర్‌కు రావాలని చెప్పి వెళ్లాడు. దీంతో భరత్‌చంద్ర తన స్నేహితుడు రాజేష్‌తో కలిసి కారులో అక్కడికి వెళ్లాడు. అక్కడ తనను పనిలో నుంచి తీసేస్తావా నీ అంతు చేస్తానంటూ అనిల్‌రాజ్ బీర్‌బాటిల్‌తో యజమానిపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. తీవ్రగాయాలపాలైన భరత్‌చంద్రను అతని స్నేహితుడు రాజేష్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

నెల్లూరు(బారకాసు): 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను రెండు విడతల మొత్తాన్ని ఏప్రిల్ 30వ తేదీలోగా ఒక్కసారిగా చెల్లిస్తే 5 శాతం రాయితీని అందిస్తున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు ప్రభుత్వ సెలవు దినాల్లోనూ యథావిధిగా పనిచేస్తాయని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని భవన యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమాన్ని నగరంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు పాల్గొని పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులు డుమ్మా

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారిగా శుక్రవారం నెల్లూరుకు వచ్చిన కొప్పుల రాజు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, ఉడతా వెంకట్రావ్‌యాదవ్, కొండా అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు తలారి బాలసుధాకర్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు డుమ్మా కొట్టారు. పార్టీ టికెట్ల కేటాయింపు విషయంలో పార్టీ పెద్దలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం, దశాబ్దాల తరబడి పార్టీ జెండా మోసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతోనే సీనియర్లు డుమ్మా కొట్టారనే గుసగుసలు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి.

అయోధ్యకాండ రామాయణానికి హృదయం

నెల్లూరు(బృందావనం): రామాయణానికి అయోధ్య కాండం హృదయం వంటిదని, రామాయణాన్ని మలుపుతిప్పింది ఆ కాండమేనని ప్రముఖ ఉపన్యాసకులు పోలవరపు లక్ష్మీనరసింహారావు తెలిపారు. పద్యసారస్వత పరిషత్ నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో రేబాలవారివీధి పీటీజీ టవర్స్‌లో నిర్వహిస్తున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో భాగంగా రెండో రోజు శుక్రవారం రాత్రి అయోధ్య కాండంపై ఆయన ఉపన్యసించారు. రామాయణంలోని అన్ని కాండాల్లో యుద్ధం ఉందని, అయోధ్య కాండంలో మాత్రం యుద్ధం లేదని, అంతకుమించిన సంఘర్షణ ఉందన్నారు. స్త్రీమూర్తుల మూర్తిమతత్వం, మానవ సమాజాన్ని రామాయణం ప్రభావితం చేస్తుందన్నారు.

16 నుంచి అనంతకోదండరాముడి బ్రహ్మోత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కొలువైన అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శ్రీవాకాటి నరసయ్య శ్రీత్యాగరాజ కల్యాణ మండపం, మందిర కమిటీల నిర్వాహకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న ఉదయం 6గంటలకు పుత్రకామేష్టి యాగం, శ్రీరామనవమి సందర్భంగా 17న సాయంత్రం 5.30 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18న ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 19న శేషవాహన సేవ, 20న హనుమంతసేవ, 21న ఉదయం 9.30 గంటలకు మోహిని (గిన్నెబిక్ష) అవతారం, రాత్రి 7 గంటలకు గరుడసేవ, 22న రాత్రి 7గంటలకు గజ వాహన సేవ, 23న ఉదయం 8గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ, 24న ఉదయం 8గంటలకు రథోత్సవం, 25న రాత్రి 7గంటలకు అశ్వ వాహన సేవలను నేత్రపర్వంగా నిర్వహించనున్నట్లు వివరించారు. 26న ఉదయం 8గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. మందిర కమిటీ కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, ఉపాధ్యక్షులు అప్పల వెంకటసత్యనారాయణ, సహాయ కార్యదర్శి అమరా మోహన్‌రావు, స్వామి పూర్ణచంద్రరావు, ఎంపీ ఆంజనేయులు, శ్రీరాం వెంకయ్య, ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తను పడేస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, ప్రైవేట్ కార్యాలయాలు, ఆస్పత్రులు తదితర భవనాల నిర్వాహకులు చెత్తను రోడ్లపై పడేస్తే చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. పొగతోటలోని ఆస్పత్రులు, వ్యాపార కేంద్రాల భవనాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా ప్రాంగణాల్లో సేకరించిన వ్యర్థాలను ఆరుబయట రోడ్లపై పడేయడాన్ని గమనించి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. చెత్త కుండీలను ప్రాంగణాల్లోనే ఉంచుకుని చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే అందజేయాలని సూచించారు. కార్పొరేషన్ నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాల వద్ద ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలు, వినియోగంపై నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం షాపుల వద్ద సేవించేందుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, స్నాక్స్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ మందు సీసాలు పడేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 54వ డివిజన్ ప్రాంతంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.